


పాత కార్ల మెగా ఎక్స్ఛేంజ్ మేళా ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



ఇప్పటికే వినియోగించిన పాత కార్ల మెగా ఎక్స్ఛేంజ్ మేళాను శాప్ ఛైర్మన్ రవి నాయుడు జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్ తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వినియోగించిన కారులను కొనుగోలుదారులు, అమ్మకం దారులను ఒకే వేదిక పైకి తీసుకురావడానికి ఈ మెగా ఎక్స్ఛేంజ్ మేళను ప్రారంభించినట్లు హర్ష టయోటా వైస్ ప్రెసిడెంట్ స్వామి తెలిపారు. ఈ మెగా ఎక్స్ఛేంజ్ మేళా శుక్రవారం ప్రారంభమై ఆదివారం ముగుస్తుందన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఊట్ల సురేంద్రనాయుడు, క్లాస్ వన్ కాంట్రాక్టర్ కష్ణమ నాయుడు, హర్ష టయోటా సీనియర్ జనరల్ మేనేజర్ సాయిబాబా ముఖేష్, ఏజీఎం శివకోటి, సేల్స్ మేనేజర్ శ్రీకాంత్, శరత్, సుభాష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'తుడా' కైనా 'సరే'

చంద్రబాబును వేడుకొన్న సుగుణమ్మ
ప్రతి 'సారీ' పట్టించుకోని అధినేత



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడ) ఛైర్మన్ పదవైనా ఇవ్వాలని తిరుపతి మాజీ ఎంఎల్‌ఎ ఎం.సుగుణమ్మ కొన్ని రోజుల క్రితం సిఎం నారా చంద్రబాబును కలిసి అభ్యర్థించారు. కూటమి పొత్తులో భాగంగా 2024లో తిరుపతి అసెంబ్లీ సీటును జనసేనకు కేటాయించారు. ఆ సందర్భంగా టిడిపి, జనసేన మధ్య విభేధాలు పొడచూపాయి. అధినేతలు నారా చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ జోక్యంతో సర్దుకుపోయారు. ఒక తాటిపైకి తెచ్చి అసెంబ్లీ సీటును గెలిపించుకున్నారు. కూటమి అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవులు ఇస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మకు సీటు గెలుచుకుని రండి.. ఎంఎల్‌ఎ కోటాలో ఎంఎల్‌సి పదవి ఇస్తానని హామీ ఇచ్చారు. ఎంఎల్‌ఎ కోటాలో ఐదు ఎంఎల్‌సి స్థానాలు ఖాళీ అయితే మూడు టిడిపికి చెందిన ముగ్గురు బిసిలకు, జనసేన రాష్ట్ర నాయకులు కొణిదెల నాగబాబుకు, బిజెపి రాష్ట్ర మాజీ అధ్యక్షులు సోమువీర్రాజుకు ఈ పదవులు వరించాయి. దీంతో ఎంఎల్‌సి పదవిపై ఆశ వదులుకున్న సుగుణమ్మ తుడా ఛైర్మన్ పదవి ఇస్తే రెండు జోడు పదవుల్లో ఉండొచ్చని భావించారు. తన అనుచర వర్గంతో రెండు రోజుల క్రితం విజయవాడకు వెళ్లి ముఖ్యమంత్రి నారా చంద్రబాబును కలిసి అర్ధగంటసేపు తన బాధనంతా చెప్పుకొచ్చారు. వయస్సు రీత్యా రాజకీయాల్లో పోటీ చేసే అవకాశం లేదని, చివరిగా తుడా ఛైర్మన్ ఇస్తే శ్రీవారి సన్నిధిలోనూ ఎక్స్ అఫిషియో సభ్యునిగానూ ఉంటానని చెప్పుకొచ్చారు. భవిష్యత్‌లో పార్టీ ఎదుగుదలకు పనిచేస్తానని ముఖ్యమంత్రికి విన్నవించినట్లు సమాచారం. అయితే సిఎం మాత్రం హామీ ఇవ్వకపోవడంతో సుగుణమ్మ నిరాశగానే వెనుదిరిగినట్లు తెలుస్తోంది. 2019 ఎన్నికల్లో సుగుణమ్మ గెలిచే సీటును మాజీ ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డికి అమ్ముడుపోయారన్న విమర్శలు ఉండడంతో ఆమెకు పదవి ఎలా ఇస్తారని ఆమె వ్యతిరేక వర్గం ప్రచారం చేస్తుండటం గమనార్హం. తుడా కోసం బడా నేతలు ప్రయత్నిస్తున్నప్పటికీ టిటిడి మాజీ ఛైర్మన్ డికె ఆదికేశవులునాయుడు మనవరాలు చైతన్య ముందు వరసలో పోటీలో ఉన్నట్లు సమాచారం.



మురుగుకాల్వలు లేక నిలిచిపోయిన వైనం (తొట్టంబేడు)



నాయుడుపేట భూపయ్యకాలనీలో ప్రసంగిస్తున్న లక్ష్మి

పల్లెటూళ్లా.. మురికి కూపాలా..!

వాడవాడలా సిపిఎం ప్రజాచైతన్య యాత్రలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, నాయుడుపేట

పచ్చదనం పరుచుకోవాల్సిన పల్లెటూళ్లు మురికి కూపాల్లా దర్శనమిస్తున్నాయనీ, పాలకులు గ్రామీణ ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదని సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి విమర్శించారు. సిపిఎం రెండో రోజు ప్రజా చైతన్య యాత్రను శుక్రవారం తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి, కంచనపల్లి, చిట్టతూరు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మురుగునీటి వ్యవస్థ అధ్వానంగా ఉండడంపై పాలకుల తీరును గంధం మణి ఎండగట్టారు. ముఖ్యంగా దళితవాడల్లో మురుగు నీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందనీ, మురుగు వెళ్లే దారి లేక ఇళ్ల ముందే నిల్వ ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ నిధులు పెద్దల కోసం ఖర్చు చేస్తారే తప్పా, పేదల కోసం నయా పైసా వెచ్చించిన దాఖలాలు లేవని మండిపడ్డారు. బోనుపల్లి దళితులు శ్మ శానానికి దారి సౌకర్యం లేక ఏళ్ల తరబడి అంతిమ యాత్రలను నరకంగా నిర్వహిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు స్పందించి గ్రామీణుల జీవన సౌలభ్యం కోసం తక్షణమే మౌలిక వసతులను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం నాయకులు పెనగడం గురవయ్య, గెడి వేణు, రాజా, గురునాధం, చుట్టు గురవయ్య, చందన్ కుమార్, గిరి తదితరులు పాల్గొన్నారు.

భూపయ్య కాలనీ గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

భూపయ్యకాలనీలో గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు లక్ష్మి, శివకవి ముకుంద డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపాలిటీ లోని 18వ వార్డు భూపయ్య కాలనీలో జనరల్‌బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాలనీలో కనీస వసతులైన మురికినీటి కాల్వలు, రోడ్లు లేవన్నారు. కాల్వలు లేక ఇళ్లలోనుంచి మురుగునీరు పోయే మార్గం లేక దోమలకు నిలయంగా ఉందన్నారు. ఇప్పటికీ గుడిసెల్లోనే కాపురం ఉంటున్నారని, పక్కా ఇళ్లు లేవన్నారు. దారి సమస్యను సిఐ, డిఎస్‌పి వచ్చి చూశారని, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరయ్య, అంకయ్య, పరమేశ్వరి, రాజేశ్వరి, కృష్ణ, రాజయ్య, లావణ్య, వెంకటరమణయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

కార్మికసంఘాల ధర్నాలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

విశాఖ స్టీలు ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసే ఆలోచన విరమించుకుని, సెయిల్‌లో విలీనం చేయాలని నేతలు డిమాండ్ చేశారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. నగర కార్యదర్శులు కె.వేణుగోపాల్, ఎండి రవి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, ఐఎఫ్‌టియు నగర నాయకులు వెంకటరత్నం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు అని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వీరోచితంగా 1492 రోజులుగా పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. విశాఖ స్టీలు ఎందరో ప్రాణ త్యాగం ఫలితంగా ఏర్పడిందన్నారు. వేలాది ఎకరాల భూములను రైతులు ఇచ్చారన్నారు. రాష్ట్రానికి ఆర్థికంగా, ఉద్యోగులకు వెన్నుముకగా పరిశ్రమ ఉందన్నారు. అటువంటి ఫ్యాక్టరీని కార్పొరేట్లకు అప్పగించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీలు ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయబోమని ఎందుకు ప్రకటించడం లేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను పూర్తి స్థాయి సామర్థ్యంతో నడపాలని, సెయిల్ లో విలీనం చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ కు స్వంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటికరణ కాకుండా పోరాడి కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి.సుబ్రమణ్యం, జయచంద్ర, బాలాజీ, బుజ్జి, నరేంద్ర, చిన్న మునిరాజా, ప్రసాద్, రాము, ఏ ఐ టి యు సి నాయకులు పి మురళి, ఏ రాధాకష్ణ, చిన్నం పెంచలయ్య, కే వై రాజా, అల్లా బాషా, చలపతి, మహేంద్ర, రామకష్ణ, ఐ ఎఫ్ టి యు నాయకులు అరుణ, గంగా తదితరులు పాల్గొన్నారు.



గూడూరులో...

– గూడూరు టౌన్‌లో టవర్‌క్లాక్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ మూడేళ్లుగా కార్మికులు ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్నా కేంద్రంలోని బిజెపిలో ఏమాత్రం చలనం లేదన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించకుండా నష్టాల బాటలోకి నెట్టేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సి. ఐ.టి.యు నాయకులు జోగి శివ కుమార్ , రామిరెడ్డి, పా మంజి మణి , దారా కోటేశ్వర రావు, ఆర్.శ్రీనివాసులు , అడపాల ప్రసాద్ , మూత్యాలయ్య , చంద్రయ్య పాల్గొన్నారు.




స్విమ్స్, రుయాకు రూ.1000కోట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి


స్విమ్స్, రుయా ఆస్పత్రులకు కేంద్ర బడ్జెట్లో రూ.1000 కోట్లు రూపాయలు కేటాయించాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్విమ్స్ ఆసుపత్రి ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపేదవాళ్లకు ఉచితంగా వైద్యం అందించాలనే ఆలోచనతో స్విమ్స్, రుయా ఆస్పత్రులను ప్రారంభించామన్నారు. కానీ పేదవాళ్ల ఆరోగ్యం గాల్లో దీపంలా ఉందన్నారు.తాజాగా టిటిడి ఛైర్మన్ తామ్ స్విమ్స్‌ను ఆదుకోలేమని చెప్పారని, ఈ రకమైన స్టేట్‌మెంట్లు మంచి ఆలోచన కాదన్నారు. ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రికి కేంద్ర బడ్జెట్ నుంచి ఏడాదికి రూ.1600 కోట్లు ఇస్తున్నారని, పాండిచ్చేరిలోని ఆస్పత్రికి రూ.1000 కోట్లు ఇస్తున్నారని గుర్తు చేశారు. అలిపిరి వద్ద కట్టే చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి భవనాలను రుయాకు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్ పాల్గొన్నారు.

అమెరికాలో ఏర్పేడు వాసిపై కాల్పులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



అమెరికాలోని మెమ్ఫిస్ లో తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం గోవిందవరం గ్రామానికి చెందిన పోతుగుంట మోహన్ సాయి అనే యువకునిపై ఈ నెల 9వ తేదీ ఆదివారం రాత్రి 11.30గంటల ప్రాంతంలో గుర్తు తెలియని దుండుగులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో మోహన్ సాయి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఏర్పేడు మండలం గోవిందవరం గ్రామానికి చెందిన పోతుగుంట మురళినాయుడు, అరుణ దంపతులకు మోహన్ సాయి ఏకైక కుమారుడు. ఈ దంపతులు ప్రస్తుతం శ్రీకాళహస్తిలో నివాసం ఉంటున్నారు. మోహన్ సాయిని చదువుల కోసం అమెరికాకు పంపారు. ఇటీవలే అతడు చదువు పూర్తి చేసుకుని ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. ఇదిలా ఉండగా పోతుగుంట మోహన్ సాయి తన మిత్రుని కారులో వెళుతుండగా, గుర్తు తెలియని దుండుగులు కారును ఆపి ముందు సీట్లో కూర్చుని ఉన్న మోహన్ సాయిపై కాల్పులు జరిపాడు. దీంతో మోహన్ సాయి భుజం, చేతికి బుల్లెట్లు తగిలాయి. అయినప్పటికీ గాయాలతో ఉన్న మోహన్ వెంటనే కారును నడిపి హైలాండ్‌లోని వాలెరో గ్యాస్ స్టేషన్‌కు చేరుకొని 911కు కాల్ చేశాడు. అత్యవసర సేవలు అందించే వారు అక్కడకు చేరుకుని మోహన్ సాయిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కాగా గోఫండ్‌మీ.కామ్ ద్వారా సుజనా పరమ్ నుంచి మోహన్‌కు ఆర్థిక సహాయం అందుతోంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి వెంటనే మోహన్ సాయి కుటుంబాన్ని వ్యక్తిగతంగా సంప్రదించారు. మోహన్ చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, ప్రభుత్వం నుంచి సాయం అందేలా కషి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు.



గొల్లవానిగుంట క్రికెట్ మైదానం పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

క్రీడామైదానాలు అందుబాటులోకి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గొల్లవానిగుంట క్రికెట్ మైదానాన్ని శాప్ ఛైర్మన్ రవినాయుడు, మున్సిపల్ కమిషనర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి అభివృద్ధి పనులను కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. శుక్రవారం ఆటోనగర్‌లో స్మార్ట్‌సిటీలో భాగంగా నిర్మితమవుతున్న క్రికెట్ మైదానాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. 65 మంది సీటింగ్ సామర్థ్యంతో పెవిలియన్, 315 మంది సభ్యుల సీటింగ్ సామర్థ్యంతో గ్యాలరీ పురోగతిలో ఉన్నాయన్నారు. ప్రాజెక్టుల మొత్తం విలువ 6 కోట్లని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అదనంగా శాప్ నుంచి 2 కోట్లు నిధులను మంజూరు చేస్తామన్నారు. వచ్చే ఆదాయాన్ని అభివృద్ధి పనులకు, స్టేడియం నిర్వహణకు ఉపయోగిస్తామన్నారు. కమిషనర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ తిరుపతిని క్రీడా, సాంస్కృతిక, టూరిజం హబ్‌గా మార్చాలని ముఖ్యమంత్రి దృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి నగరపాలక సంస్థ ఎస్ ఈ సురేంద్ర, జిల్లా స్పోర్ట్స్ అభివద్ధి అధికారి సయ్యద్ సాహెబ్ పాల్గొన్నారు.

మహిళలకు ఉక్కు కవచం శక్తి యాప్ : ఎస్‌పి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు, బాలికల భద్రత కొరకు శక్తి యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు, అత్యాచారాలు, ఇతర హింసాత్మక సంఘటనలను నివారించటానికి ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా ఎస్ పి హర్షవర్ధన్ రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ప్రతి ఒక్క మహిళ, గహిణిలు విద్యార్థినిలు, బాలికలు మొబైల్ లో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం పొందాలని తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలు ఎవరైనా ఎస్.ఓ.ఎస్ బటన్ నొక్కిన వేంటనే వారు ఉన్న ప్రాంతం వివరాలు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్ కు, డయల్ 112 నెంబర్ కు చేరుతుంది. వెంటనే పోలీసులు అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకొని వారికి రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీవాణిని పరామర్శించిన సిఐటియు నేతలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఇటీవల విజయవాడలో జరిగిన అంగన్‌వాడీల ఆందోళనకు వెళ్లిన పిచ్చాటూరు అంగన్‌వాడీ కార్యకర్త శ్రీవాణి అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన విషయం విదితమే.విజయవాడ ఆస్పత్రి నుంచి తిరుపతి రుయాలో ప్రస్తుతం చికిత్స పొందుతున్న శ్రీవాణిని సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, యూనియన్ గౌరవాధ్యక్షులు ప్రసాద్‌రావు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్, సిఐటియు నాయకులు నాగలాపురం నాగరాజు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పద్మలీల, రాజేశ్వరి, ప్రాజెక్ట అధ్యక్షురాలు ఇంద్రాణి పరామర్శించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో చక్కగా పనిచేస్తున్న శ్రీవాణి అందరిలో కలివిడిగా ఉంటూ ఉత్సాహంగా పనిచేస్తున్న శ్రీ వాణి ఇలా బెడ్ పై చూడడం బాధాకరమన్నారు త్వరగా కోలుకొని మునుపటిలాగా విధులు నిర్వహించాలని, కుటుంబానికి అండగా ఉండాలని ఆకాంక్షించారు.



ఎస్వీయూలో జర్మనీ భాష అభ్యసనా కేంద్రం ఏర్పాటుకు కసరత్తు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గురువారం సాయంత్రం ఎస్వియూ ఇంజనీరింగ్ కళాశాల "స్టడీ వింగ్స్ ఓవర్సీస్ సంస్థ" సహకారంతో జర్మనీ భాష అభ్యసన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి కార్యాలయంలో స్టడీ వింగ్స్ సంస్థ ప్రతినిధులు వర్సిటీ ఇంచార్జ్ విసి అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విసి, రిజిస్ట్రార్ లు మాట్లాడుతూ జర్మనీలో విద్యా, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపైన దష్టి కేంద్రీకరించిందని అన్నారు. ఇందు కొరకు వర్సిటీలో "స్టడీ వింగ్స్ టు ఓవర్సీస్" సంస్థ సహకారంతో జర్మనీ అభ్యసన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. సమావేశం అనంతరం సంస్థ ప్రతినిధులు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో ఇంట్రాక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టడీ వింగ్స్ సంస్థ ప్రతినిధులు నరేంద్ర రెడ్డి, వల్లేరు సుకన్య పాల్గొన్నారు.



తిరుపతి రుయాలో సిఐటియు పరామర్శ

తిరుమలలో ఘనంగా కుమారధార తీర్థ ముక్కోటి

ప్రజాశక్తి - తిరుమల



తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి వాయవ్యదిశలో వెలసివున్న శ్రీ కుమారధార తీర్థ ముక్కోటి శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కుమారధార తీర్థ ముక్కోటికి విచ్చేసే భక్తులకు టీటీడీ విస్తత ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా తీర్థానికి విచ్చేసిన భక్తులకు శ్రీవారి సేవకుల సహకారంతో పాలు, కాఫీ, ఉప్మా, పొంగలి, సాంబారు అన్నం, పెరుగన్నం, పులిహోరా, మజ్జిగ, తాగునీరు అందించారు. టీటీడీ విజిలెన్స్, పోలీస్, అటవీ విభాగాలు సమన్వయంతో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించారు.ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా ప్రకతి సౌందర్యాల నడుమ నిర్వహించే కుమారధార తీర్థముక్కోటిని దర్శించి, స్నానమాచరించడం భక్తులు ఒక ప్రత్యేక అనుభూతిగా భావిస్తారు.



నేడు వేంకటపాలెంలో శ్రీనివాస కల్యాణోత్సవం



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సిఆర్‌డిఎ పరిధిలోని వేంకటపాలెంలో శనివారం శ్రీనివాస కల్యాణోత్సవం జరగనుంది. 27వేల మంది భక్తులు తిలకించేలా టిటిడి ఏర్పాట్లు చేసినట్లు ఈవో జె.శ్యామలరావు వెల్లడించారు. శుక్రవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో టిటిడి అధికారులు, జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సిఆర్‌డిఎ పరిధిలోని 24 గ్రామాల ప్రజలు వేంకటపాలెం చేరేందుకు వీలుగా టిటిడి దాదాపు 300 బస్సులను ఏర్పాటు చేసింది. తుళ్లూరు, తాడేపల్లి, తాడికొండ, మంగళగిరి మండలాల ప్రజలు సులువగా కల్యాణవేదిక ప్రాంగణానికి చేరేందుకు వీలుగా బస్సులను ఏర్పాటు చేశారు. విజయవాడ నుంచి అమరావతికి బస్సు సౌకర్యం విరివిగా ఉన్న నేపథ్యంలో మందడం నుంచి ప్రతి ఐదు నిమిషాలకు ఒక బస్సును ఏర్పాటు చేశారు. దాదాపు నాలుగు టన్నుల పూలు, 30వేల కట్‌ఫ్లవర్స్, మామిడి, అరటి, టెంకాయ తోరణాలతో అలంకరించనున్నారు. శ్రీవారి కల్యాణానికి పూలమాలలు టిటిడి గార్డెన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4గంటల నుండి 5 గంటల వరకు చెన్నైకి చెందిన నిత్యశ్రీ మహదేవన్ గ్రూప్ ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమాలు జరగనున్నాయి. సాయంత్రం 5 గంటల నుండి 6.15 గంటల వరకు చెన్నైకి చెందిన ప్రియా సిస్టర్స్ అన్నమాచార్య సంకీర్తనలను కల్పించనున్నారు. తదనంతరం కల్యాణోత్సవంలో శ్రీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కీర్తనలను ఆలపించనున్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి,కలెక్టర్ సర్వశ్రీ నాగలక్ష్మీ, జేఈవో వి. వీరబ్రహ్మం, టిటిడి సివిఎస్వో హర్షవర్ధన్ రాజు, ఎస్పీ సతీష్ కుమార్, సిఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుకు ఆహ్వానం

సిఎం చంద్రబాబునాయుడు శ్రీవారి కల్యాణోత్సవానికి హాజరుకావాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈవో శ్యామలరావు, జెఇఒ వెంకన్నచౌదరి, బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంఎస్ రాజు, నన్నపనేని సదాశివరావు ఉండవల్లి నివాసంలో కలిసి ఆహ్వానించారు. వెంకటపాలెం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగే శ్రీనివాస కల్యాణోత్సవానికి రావాలని ఆహ్వానపత్రికను అందజేశారు. అనంతరం ఐటి శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆహ్వానించారు. శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

సిఎం చంద్రబాబుకు టిటిడి ఆహ్వానం

శ్రీవారి ఆశిస్సులతో రాజధాని పనులు పూర్తవ్వాలి : కొల్లు రవీంద్ర

తిరుమల శ్రీవారిని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు తిరుమల పవిత్రత కోసం కృషి చేస్తున్నారన్నారు. శనివారం అమరావతిలో శ్రీనివాస కల్యాణం పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని, శ్రీవారి ఆశిస్సులతో రాజధాని పనులు త్వరితగతిన పూర్తవ్వాలని అన్నారు.



సిఎం నివాసంలో ఆహ్వానం అందిస్తున్న టిటిడి ఛైర్మన్

తాగునీటి సమస్యను పరిష్కరించాలి : సిపిఎం




సమస్యలపై నిరసన చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ మూడవ వార్డుకు చెందిన ధాయ్ మంబాపురం నివాసితుల తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం సిపిఎం పార్టీ నాయకులు అక్కడ పరిస్థితులను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ కార్యదర్శి ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ ధాయ్ మంబాపురంలో ప్రజలు 40 సంవత్సరాలుగా జీవాలు మేపుతూ అక్కడ కాపురం ఉంటున్నారని తెలిపారు. కనీసం వారికి తాగు నీటి సౌకర్యం కూడా లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సిమెంట్ రోడ్లు లేక వర్షాకాలంలో వీధులు బురదమయం ప్రవహిస్తున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఆ గ్రామస్తులకు మౌలిక వసతులు కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కేశర్ సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు సాంబయ్య, కృష్ణయ్య, మారెప్ప, రాజయ్య, వరలక్ష్మి, చంగమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కోట: కోట మండలం, విద్యానగర్, సాయిబాబా మందిరం వద్ద ఈ నెల 16వ తేదీన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని సుశీల నేత్రాలయ నిర్వాహకులు డాక్టర్ పి సుధాకర్ రావు తెలిపారు. ఈ శిబిరానికి నెల్లూరు నుండి డాక్టర్ పి. సుధాకర్ రావు వస్తున్నారని తెలిపారు. కంటి సమస్యలుతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీ వసతి గృహాల్లో ఆర్‌ఒ ప్లాంట్లు ఏర్పాటు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తిరుపతి జిల్లా పరిధిలో ఆరు వెనుకబడిన తరగతుల వసతి గృహాల్లో సుమారు రూ.15లక్షలతో ఆర్వో ప్లాంట్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ ఆర్వో ప్లాంట్ల ప్రారంభోత్సవం సందర్భంగా కెన్ ఫిన్ హోమ్స్ మేనేజరు బాల చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ చదివే విద్యార్థులకు శుద్ధ జలం అందివ్వాలని ఆశయంతో ఈ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చి సహకరించిన జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సాధు చంద్రశేఖర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో కెన్ ఫిన్ హోమ్స్ డిప్యూటీ మేనేజరు ప్రసాద్, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిణి జ్యోత్స్న, ఏబీసీడబ్ల్యువో లక్ష్మీనారాయణ, వసతి గృహాల వార్డెన్లు ఎన్.విజయకుమారి, శ్రీలక్ష్మి, మాలతి, రాధారాణి, ఫహమదున్నీసాలు పాల్గొన్నారు.

కష్టపడి కాదు.. ఇష్టపడి చదవండి

ప్రజాశక్తి -ముద్దునాయుడుకండ్రిగ: 17 వ తేదీ నుండి జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చని ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని స్థానిక కల్లి వెట్టు ఉన్నత పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు సరస్వతీ పూజ చేసి వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయ బృందం యువశ్రీ మురళి, సురేష్ బాబు, నాదెం డ్ల మురళి, ఒబ్బుదేవి ప్రసాద్, వేణుగోపాల్, దాసు, మాధవీలత, దేవేంద్ర, లక్ష్మయ్య, జగన్నాథం, దీపిక తదితరులు పాల్గొన్నారు.

ఏసిడి విద్యుత్ బిల్లుకు 50 శాతం రాయితీ

ప్రజాశక్తి -కోట : విద్యుత్ బిల్లులో వచ్చే ఏసీడీ బిల్లుకు స్కీము ద్వారా రాయితీ ఉంటుందని విద్యానగర్ సబ్ డివిజనల్ అధికారి చిన్నయ్య తెలిపారు. ఈ సందర్భంగా కోట మండలంలోని స్థానిక విద్యానగర్ సబ్ డివిజనల్ కార్యాలయంలో విద్యుత్ శాఖ ఏడిఈ చిన్నయ్య మాట్లాడుతూ ఏ సి డి బిల్లుకు సగానికి సగం కట్టే వెసులబాటు ప్రభుత్వం కల్పించడం జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా ప్రస్తుతం సోలార్ విద్యుత్తు కొరకు సర్వే జరుగుతుందని తెలిపారు.

శ్రామిక వర్గ సైనికుడు కారల్ మార్క్స్



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రపంచ దేశాల్లోని శ్రామిక , కార్మిక వర్గాల వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన శ్రామిక వర్గ సైనికుడు కారల్ మార్క్స్ అని సీపీఐ ప్రాంతీయ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సీపీఐ సీనియర్ నాయకులు టి.రామి రెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణ సీపీఎం కార్యాలయంలో కారల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా సిపిఎం గూడూరు కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు జోగి శివ కుమార్ , టి.రామి రెడ్డి మాట్లాడుతూ పెట్టుబడిదారి రాజ్యాన్ని కూకటి వేళ్లతో కూల్చి కార్మిక వర్గ రాజ్యాస్థాపనే లక్ష్యంగా సిద్ధాంతాలను బోధించిన వ్యక్తి కారల్ మార్క్స్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సురేష్, అడపాల ప్రసాద్, పామంజి మణి , ఆర్.శ్రీనివాసులు, చంద్రయ్య , ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు ప్రగతి సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ జన్మదిన సందర్భంగా బాలాజీ నగర్, ప్రగతి సేవా సంస్థ ఆఫీస్‌లో కేక్ కట్ చేసి, అనంతరం 50 మంది మహిళలకు చీరలు, వెజిటబుల్ బిర్యాని పంపిణీ చేశారు. అనంతరం పూల తోట గిరిజన కాలనీకి చెందిన ప్రమీలమ్మకు కుట్టు మిషన్ అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బండి ధనుంజయ్ రెడ్డి, సెక్రెటరీ జి చంద్రశేఖర్, ట్రెజరీ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబ సభ్యులు, మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి రూరల్, ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధి, పేరూరు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సైబర్ వలలోపడి రూ. 5,39,000 మోసపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న వ్యక్తి వర్క్ ఫ్రం హోమ్ చేస్తుండగా, 2024 డిసెంబర్ 29న టెలిగ్రామ్ ద్వారా ఓ సందేశం అందింది. హోటళ్లకు స్టార్ రేటింగ్ ఇవ్వడం ద్వారా డబ్బు సంపాదించొచ్చని పేర్కొన్నారు. వారి సూచనలు ఆచరించగా, మొదట రూ.700 అతని ఖాతాలో జమైంది. స్థిరమైన ఉద్యోగానికి డబ్బు జమ చేయాలని మోసగాళ్లు చెప్పగా 12 బ్యాంక్ ఖాతాల్లో రూ. 5,39,000లు అతను జమ చేశాడు. అయినా100 పాయింట్లు పూర్తి కాలేదని, ఇంకా డబ్బు జమ చేయాలని నేరగాళ్లు ఒత్తిడి చేయడంతో మోసపోయినట్లు బాధితుడు గ్రహించాడు. 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేసి, తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బాధితులు ఫిర్యాదు మేరకు ఎం.ఆర్ పల్లి సి.ఐ టి.చిన్న గోవిందు కేసు నమోదు దర్యాప్తు ప్రారంభించారు.

ప్రారంభానికి నోచుకోని పాల శీతలీకరణ కేంద్రం

ఏడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న కుప్పం బాదూరు పాల శీతలీకరణ కేంద్ర భవనం



ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలో రాయల చెరువు కట్ట కిందపై భాగాన ఉన్న గ్రామాలలో పాడి రైతులు ఆవులను సంరక్షించుకొని, పాలు అమ్ముకొని జీవనం సాగించేవారు. ఏడేళ్లగా పాలశీతలేకరణ భవనం నిరుపయోగంగానే ఉంది. పాడి రైతుల నుండి పాలను సేకరించి చిల్లింగ్ చేసేందుకు అనువుగా తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మండలంలోని కుప్పం బాదూరు గ్రామంలో (బిఎంసి) పాల శీతలీ కరణ కేంద్రాన్ని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంజూరు చేసింది. ఈ పాల శీతలీకరణ కేంద్రంలో పాలను చిల్లింగ్ చేసి, తిరుపతి బాలాజీ డైరీ (శ్రీజ డైరీకి) తరలించడమే లక్ష్యంగా ఏర్పాటు చేశారు. 2017-18 వ సంవత్సరం ఆర్థిక సంవత్సరంలో ఆ పాలశీతలేకరణ నిర్మాణానికి రూ. 30 లక్షల నిధులు మంజూరు చేసింది. అప్పటి సర్పంచ్ బి.జమున ధనుంజయులు పాలశీతలీకరణ భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. 2019వ సంవత్సరంలో ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభోత్సవం ఆగిపోయింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుపయోగంగా ఉన్న పాలశీతలీకరణ భవనం గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఇకనైనా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు, చంద్రగిరి ఎమ్మెల్యే నాని స్పందించి పాలశీతలేకరణ పున:ప్రారంభించి పాడి రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాల శీతలీకరణ కేంద్రాన్ని ప్రారంభించాలి



ఏడేళ్లగా కుప్పం బాదూరులోని పాలశీతలీ కరణ కేంద్రం నిరుపయోగంగా ఉంది. ప్రజాధనాన్ని రూ. 30 లక్షల రూపాయలతో నిర్మించి అధికారులు పట్టించుకోకపోవడం విచారకరంగా ఉంది. పాలశీతలేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తే స్వయం సహాయక సంఘాల్లో పనిచేసే మహిళలకు ఉపాధి కూడా దొరుకుతుంది. పాల రైతులకు ఉపయోగంగా ఉంటుంది.

- అమరావతి, డ్వాక్రా మహిళ, కుప్పం బాదూరు

కేంద్రాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటా



జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కుప్పం బాదూరులో నిర్మించిన పాలశీతలేకరణ కేంద్రాన్ని పరిశీలించి, ఇన్నేళ్లుగా ఎందుకు నిరుపయోగంగా ఉందనే విషయాలను పరిశీలించి, త్వరలో ప్రారంభోత్సవం చేయించి, పాల రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటాం.

- శోభన్ బాబు, డిఆర్డిఏ పిడి, తిరుపతి జిల్లా

కొనసాగుతున్న వెటర్నరీ విద్యార్థుల సమ్మె



ప్రజాశక్తి - తిరుపతి : వెటర్నరీ విద్యార్థులు స్టైఫెండ్ పెంపును డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న నిరవధిక సమ్మె నేటితో 40వ రోజుకు, రిలే నిరాహార దీక్ష 36వ రోజుకు చేరుకుంది. ఈరోజు దేశమంతా రంగురంగులతో హోలీ జరుపుకుంటున్నా, మా జీవితంలో మాత్రం ఎలాంటి రంగులు లేవంటూ విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. తిరుపతి ఎమ్మెల్సీ డాక్టర్ సి.సుబ్రహ్మణ్యంను కలిసి వారి ఆవేదనను తెలిజచేశారు. స్టైఫండ్ పెంపుకు కేవలం సంవత్సరానికి రూ 8 కోట్లు లోపే ఖర్చు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆలోచించడం బాధాకరమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. విద్యార్థులు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్, మంత్రి అచ్చంనాయుడులకు సమస్యను విన్నవించుకున్నా వారి సమస్యలు పరిష్కారం కాకపోవడం దారుణమన్నారు. ఈ పోరాటం ఎక్కడా ఆగదని విద్యార్థి నాయకులు తెలిపారు. వెటర్నరీ విద్యార్థుల ఆక్రోశం సమాజం వినాలన్నారు. బాధ్యత వహించాల్సిన వారు స్పందించాలని కోరారు. సమానత్వం, గౌరవం, న్యాయం లభించే వరకు ఈ నిరసన కొనసాగుతుందని తెలిపారు. త్వరలో సమ్మెను మరింత ఉధృతం చేయనున్నట్లు ప్రకటించారు.

'ఒక కుటుంబం - ఒక వ్యవస్థాపకుడు' నినాదంతో జీవనోపాధి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి): ఒక కుటుంబం-ఒక వ్యవస్థాపకుడు నినాదంతో జీవనోపాధి మెరుగు పరచటానికి సీఎం చర్యలు తీసుకుంటున్నట్లు శ్రీ సిటీ డైరెక్టర్ సురేష్ బాబు తెలిపారు. సీఎం, జిల్లా కలెక్టర్ల ఆదేశాల మేరకు, స్వర్ణ నారావారిపల్లి అభివృద్ధిలో భాగంగా శుక్రవారం 35 మందికి శ్రీ సిటీ ఆధ్వర్యంలో, ఏపీఎస్ఎస్‌డిసి, డిఆర్‌డిఏ, జిల్లా పంచాయతీ రాజ్ డిపార్ట్మెంట్ వారి సహకారంతో యల్‌యంవి డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సురేష్ బాబు, డైరెక్టర్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి, ఏపీఎస్ఎస్‌డిసి ఆర్.లోకనాథంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, బ్యాంకు రుణ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు అవసరమైన మేరకు వారికి ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. సురేష్ బాబు మాట్లాడుతూ శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ప్రోత్సాహాలు అందిస్తామని చెప్పారు. డిఆర్డిఏ ఏపీఎం గంగయ్య మాట్లాడుతూ నారవారిపల్లె, కందులవారిపల్లె, భీమవరం, శేషాపురంలో ఉన్నటువంటి ఎస్ఎస్‌జి సభ్యులు, యువత ఈ అవకాశం వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సిటీ సిబ్బంది సీతారామయ్య, మురళి, ఏపీ ఎస్ఎస్డిసి సిబ్బంది దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ దినోత్సవ వేడుకలు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి మెడికల్ ల్యాబ్ టెక్నిషన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కచ్చపి కళా క్షేత్రంలో శుక్రవారం ల్యాబ్ టెక్నిషన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేయర్ డాక్టర్ శిరీషా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక హాస్పిటల్‌కు మంచి పేరు వస్తోందంటే, ఆ హాస్పిటల్ వెనుక ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ ప్రముఖ పాత్ర పోషిస్తుంటాడని తెలిపారు. తాను మేయర్‌గా కాకుండా ఓ డాక్టర్‌గా ఈ కార్యక్రమానికి విచ్చేశానని, కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న సమయంలో డాక్టర్లు, నర్సులు, పారిశుధ్య కార్మికులు, ల్యాబ్ టెక్నిషన్స్ అందించిన సేవలు అమూల్యమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్వో బాలకృష్ణ నాయక్, డాక్టర్ దగ్గుబాటి శ్రీహర్రావు, సినీనటులు గౌతమ్ రాజు, రాష్ట్ర అసోసియేషన్ నుంచి నవీన్, శ్రీహరిబాబు, తిరుపతి మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షులు వినయ్ కుమార్, ఉపాధ్యక్షులు హరిబాబు, నితిన్ కార్యదర్శి ప్రభు, సభ్యులు హరి, నరేంద్ర, అశోక్, ల్యాబ్ టెక్నిషన్స్ అసోసియేషన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలు

ప్రజాశక్తి - తిరుపతి : టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలు పోటాపోటీగా జురుగుతున్నాయి. శుక్రవారం జరిగిన ఆటల పోటీల్లో షటిల్– టీటీడీ మహిళా అధికారుల డబుల్స్ పోటీల్లో రమాదేవి, నీలిమ జట్టు విజయం సాధించగా, దేవి, దామర సెల్వి జట్టు రన్నరప్‌గా నిలిచింది. మహిళా అధికారుల సింగిల్స్ పోటీలలో రమాదేవి విజయం సాధించగా, మాధవి రన్నర్‌గా నిలిచారు. పురుష అధికారుల డబుల్స్ పోటీల్లో గోవింద రాజన్, సురేంద్ర జట్టు విజయం సాధించగా, వెంకటేశ్వర్లు, పార్థసారథి జట్టు రన్నరప్‌గా నిలిచింది. పురుష అధికారుల సింగిల్స్ పోటీల్లో సురేంద్ర విజయం సాధించగా, వెంకటేశ్వర్లు రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్ల పైబడిన మహిళ ఉద్యోగుల డాడ్జ్ బాల్ సింగిల్స్ పోటీలలో కె.పద్మజ విజయం సాధించగా, పి.పద్మజ రన్నర్‌గా నిలిచారు.

రూపేస్ ఏజెన్సీకి ఇచ్చిన అనుమతి రద్దు చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థినీలకు స్వీయ రక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) కార్యక్రమానికి సంబంధించి నిబంధనలు పాటించకుండా రూపేస్ ఏజెన్సీకి శిక్షణ ఇచ్చే వర్క్ ఆర్డర్లను జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపిసీవో) లు అప్పగించారని, వీటిని వెంటనే రద్దు చేయాలని ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డా.యు.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాన్ పవర్ ఏజెన్సీ అయిన రూపేస్ ఏజెన్సీకి స్వీయ శిక్షణా కార్యక్రమంలో ఎలాంటి అర్హత లేదని, ఆ సంస్థ ఎండికి ఎటువంటి నైపుణ్యం లేదని తెలిపారు. సమగ్ర శిక్ష ఎస్పిడి ఇచ్చిన ఆదేశాలను రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో అనుసరించలేదని, నంద్యాల జిల్లాలో అయితే రూపేస్ ఎజెన్సీ దరఖాస్తు చేసుకున్నప్పటికీ అర్హత లేకపోవడంతో ఆ సంస్థకు శిక్షణా కార్యక్రమం వర్క్ ఆర్డర్ ఇవ్వలేదన్నారు. నంద్యాల జిల్లాలో అర్హత సాధించలేని రూపేస్ సంస్థ తిరుపతి జిల్లాలో అర్హత ఎలా సాధించిందో చెప్పాలన్నారు. వెంటనే విచారణ చేసి అర్హతగల సంస్థలను ఎంపిక చేసేలా విద్యాశాఖ మంత్రి ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

ఘనంగా ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జయంతి

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్ స్టీన్ 146వ జయంతి తిరుపతి పట్టణంలోని ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ వద్ద నున్న ఐన్ స్టీన్ విగ్రహం వద్ద శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, ఆచార్య శివకుమార్, ఆచార్య సురేంద్రబాబులు సైన్స్‌పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రెడ్డప్ప, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది కిరణ్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, యజమాని జయరామిరెడ్డి, ప్రొఫెసర్లు శివకుమార్, సురేంద్ర బాబు, సైంటిస్ట్ రామయ్య, కార్యకర్తలు రఫీ, లక్ష్మీనారాయణ, బిర్లా నాయుడు, ఓవి రమణ, కుప్పస్వామి, సామాజిక సేవా నాయకులు టెంకాయల దామోదరం, నారాయణ, ముని లక్ష్మీ, వెంకటముని, యూనివర్సిటీ స్కాలర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గణితశాస్త్ర కార్యశాల ముగింపు

ప్రజాశక్తి - క్యాంపస్ : గణిత విద్యార్థులకు ఆవర్తనాలపై అవగాహన ఆవశ్యకమని చెన్నై మ్యాథమెటికల్ ఇన్స్టిట్యూట్ ఆచార్యులు ఆచార్య పరమేశ్వరన్ పేర్కొన్నారు. యస్వీయు గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "ఆల్జీబ్రా ఆల్జీబ్రిక్ నెంబర్ థియరీ టోపాలజీ అండ్ దేర్ అప్లికేషన్స్ 2025" అనే అంశంపై మూడు రోజుల కార్యశాల శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ కార్యాశాలలో ఆల్జీబ్రా, నెంబర్ థియరీ విశ్లేషణ అంశాలను, టోపాలజీ అధ్యయనం గురించి తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యశాల కోఆర్డినేటర్ ఆచార్య సి.జయసుబ్బారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

17న గ్రామ పంచాయతీ కార్మికుల 'చలో విజయవాడ'



పాకాల : ఈనెల 17న 'చలో విజయవాడ' కార్యక్రమానికి జిల్లానుంచి పెద్దఎత్తున గ్రామ పంచాయతీ కార్మికులు తరలి రావాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటరామయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు. సిఐటియు జిల్లా నాయకులు మధుసూదన్‌రావు, తిరుపతి జిల్లా అధ్యక్షులు రాము, కార్యదర్శి నాగభూషణం, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీమోహన్, పాకాల మండల నాయకులు ప్రసాద్, చంద్ర, బాలకృష్ణ, చెంగల్‌రాయులు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తోందని, ఎనిమిదేళ్లుగా తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోలేదని కార్మికులు వాపోయారు.

కన్యకా పరమేశ్వరి ఆలయ ధర్మకర్తగా పసుపర్తి గోపినాథ్



ప్రజాశక్తి -తిరుపతి సిటీ : ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ ధర్మకర్తగా పసుపర్తి గోపినాద్ వ్యవహరిస్తారని ఆర్యవైశ్య సంఘం నాయకులు, కాశి అన్నపూర్ణ సత్రం కార్యదర్శి వచ్చు విలాస్ తెలిపారు. శ్రీవారి సన్నిధిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సంస్థ ఎండోమెంట్ అధీనంలో ఉన్నందున ధర్మ సత్రం అధ్యక్షులుగా ఎవరిని నియమించినా ఎండోమెంట్ ద్వారా అనుమతి అవసరం అన్నారు. ఎండోమెంట్ అనుమతి లేకుండా 2023లో పామిడి సత్యనారాయణ, కొండూరు మహేష్, పసుపర్తి గోపీనాథ్ అనారోగ్య కారణాలు చూపిస్తూ ఆయనను ధర్మసత్రం ధర్మకర్తగా, అధ్యక్ష పదవి నుంచి తొలగించి. పామిడి సత్యనారాయణ అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా కొండూరు మహేష్ ను ప్రకటించుకున్నారు. అక్కడి స్థలాలను ఆర్యవైశ్యులకు కట్టు కథలు చెప్పి, కొన్ని పదుల సంఖ్యలో ఆ భూములు లీజికి ఇచ్చి, కొన్ని కోట్ల రూపాయలు వసూలు చేశారని, ఆ భూములు ప్రోహిబిటెడ్ లిస్టులో ఉన్న, రిజిస్ట్రేషన్ వారిని డబ్బుతో ప్రలోభ పెట్టి, మొత్తం 13 లీజు డాక్యుమెంట్లు తయారుచేసి రిజిస్ట్రేషన్ కొరకు సమర్పించిన తరుణంలో మాకు తెలిసిందన్నారు. ఈ అక్రమాలపై పిర్యాదు చేయడంతో కమిషనర్ దీనిపైన స్పందించి, విచారణ జరిపి పామిడి సత్యనారాయణ, మహేష్, శిరీషల ఎన్నికను రద్దు చేస్తూ, వారి స్థానంలో పసుపర్తి గోపినాద్ ను నియమించారన్నారు. కనుక ప్రస్తుతం గోపీనాథ్ ఆ ఆలయ ధర్మకర్తగా కొనసాగుతారని తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో త్వరలో నూతన కమిటీని ఎన్నుకుంటారని వెల్లడించారు. ఈ సమావేశంలో జక్కా సుబ్బరాజు, మిట్ట లోకేష్, వెంకటేశ్వర్లు, పసుపర్తి గోపీనాథ్, లక్మయ్య, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టు మోసం : సి.అస్లాం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణానికి చెందిన దారం హరి, దారం అనిత జనసేన పార్టీ రాష్ట్ర స్థాయి నాయకులుగా ప్రచారం చేసుకొని అమాయకులైన జనసేన పార్టీకి చెందిన క్షేత్రస్థాయి వారిని మోసం చేస్తున్నారని, అందులో భాగమే స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టు ఇప్పించి తమను మోసం చేశారని పీలేరు నియోజకవర్గం, కలికిరి మండలం జనసేన పార్టీ మాజీ మండలాధ్యక్షులు సి.అస్లాం తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది నవంబర్ మాసంలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు నగరంలో ఉన్న అపర్ణ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ద్వారా స్మార్ట్ మీటర్లను అమర్చే కాంట్రాక్టర్లు ఇప్పిస్తామని దారం హరి, దారం అనిత ఆ కంపెనీ ఎండి సందీప్ కుమార్ కు రూ.5 లక్షల రూపాయల సెక్యూరిటీ డిపాజిట్ ను కట్టించి, తమ కమిషన్ గా ఆరు లక్షల రూపాయలను డిమాండ్ చేస్తే రూ.1.50 లక్షల రూపాయల నగదును వారికి ఇచ్చామన్నారు. అయితే కాంట్రాక్టు ఒప్పించుకున్న కలికిరి పీలేరు నియోజకవర్గానికి సంబంధించి ఇంతకు మునుపే నేరుగా అధాని కంపెనీ ద్వారా కాంట్రాక్ట్ దక్కించుకున్న వారు స్మార్ట్ మీటర్ల పనులు చేస్తుండటంపై, తన వద్ద 5 లక్షల రూపాయలు డబ్బు తీసుకున్న అపర్ణ ఓవర్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండి సందీప్ కుమార్‌ను, దారం హరి, దారం అనితలను ప్రశ్నించడంతో వారి వద్ద నుండి సమాధానం రాలేదన్నారు. కాంట్రాక్ట్ రద్దు పరచి తన పెట్టుబడి నగదును ఇప్పించాలని కోరడంతో, తన వద్ద ఉన్న రెండు కోట్ల విలువ చేసే స్మార్ట్ మీటర్ల పరికరాలను తిరిగి ఇవ్వాలని ఒత్తిళ్ల తీసుకొచ్చి బయట వ్యక్తులతో ఫోన్ కాల్స్ చేయిస్తూ బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ఇదే విషయాన్ని కొద్ది రోజులకు ముందు విజయవాడలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరించామన్నారు. అప్పటినుండి మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన తనను ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ ఎటువంటి కారణాలు చూపకుండా తనను మండల అధ్యక్ష పదవి నుండి తప్పించారన్నారు. క్షేత్రస్థాయిలో జనసేన పార్టీ నాయకుల ముసుగులో చేస్తున్న తంతును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశితంగా పరిశీలించి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తనకు జరిగిన అన్యాయం మరొక జనసేన పార్టీ కార్యకర్తకు జరగకుండా ఉండాలంటే పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో శనివారం నుండి ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటున్నానని స్పష్టం చేశారు.

ఎర్రచందనంపై ఎన్బిఏ అంతర్గత సమావేశం

గోప్యత ఎందుకో?

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలంలోని అరుదైన ఎర్రచందనంపై నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ ఆధ్వర్యంలో తిరుపతి నగర పరిధిలోని మానస సరోవర్ హోటల్‌లో అథారిటీ చైర్ పర్సన్ అచలేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్గత సమావేశం నిర్వహించారు. ఎర్రచందనం వృక్ష సంపదను పెంపొందించడం, అక్రమ రవాణా అరికట్టడానికి అనుసరించాల్సిన విధానాలు, శేషాచలం అటవీ ప్రాంతంలో జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను, జంగిల్ సఫారీ, పర్యాటక అభివృద్ధి వంటి విషయాలపై రాష్ట్ర స్థాయి అటవీ శాఖ అధికారులతో చర్చించినట్టుగా సమాచారం. ఇంత గోప్యంగా మీడియాకు అనుమతి లేకుండా సమావేశం నిర్వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమావేశంలో రిసెర్చ్ పిసిసిఎఫ్ చలపతిరావు, రాష్ట్ర బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయ విజయ్ కుమార్, కార్యదర్శి రామకృష్ణ, తిరుపతి సర్కిల్ సిసిఎఫ్ సెల్వం, బయోట్రీమ్ స్టేట్ సిల్వికల్చరిస్ట్ నరేందిరన్, జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్, డివిజనల్ ఫారెస్ట్ అధికారులు, క్షేత్రస్థాయి అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు. సమావేశంపై విలేకరులు సంబంధిత అధికారులను ఫోను ద్వారా సంప్రదించాలన్నా అధికారులు స్పందించలేదు. ఎర్రచందనం విక్రయాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చాలని, ఇందుకుగాను నిర్వహించే గ్లోబల్ టెండర్ల నిర్వహణపై కూడా చర్చించారని సామాచారం. శాసనమండలి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్లోబల్ టెండర్లను వాయిదా వేసి, తిరిగి ఎప్పుడు నిర్వహించాలనే విషయమై అటవీశాఖ అధికారులు కసరత్తు చేసినట్లు తెలుస్తోంది.

క్రైం న్యూస్

లారీ ఢీకొని విద్యార్థి మృతి



మృతి చెందిన ప్రత్యూష్

ప్రజశక్తి - తడ : తడ మండలం, మాంబట్టు సమీపంలో చెరువు వద్ద నేషనల్ హైవే పై లారీ వెనక నుంచి ఢీకొన్న ఘటనలో బైక్ మీద వెళుతున్న ప్రత్యూష్ (21) మృతి చెందాడు. పోలీసు వారు అందించిన సమాచారం మేరకు కర్ణాటక రాష్ట్రం, గాంధీనగర్ మైసూర్, మాండ్యకు చెందిన ప్రత్యూష్ శ్రీ సిటీ, ఐఐటి కాలేజీలో 2 వ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం హోలీ సందర్భంగా, స్కూటీపై సూళ్లూరుపేట నుండి రంగులు తీసుకొని వస్తున్న సమయంలో మాంబట్టు చెరువు వద్ద నేషనల్ హైవే పై చెన్నై వైపు వేళుతున్న లారీ అతివేగంగా వచ్చి స్కూటీని వెనుకనుంచి ఢీకొట్టడంతో ప్రత్యూష్ కిందపడ్డాడు. అనంతరం లారీ ప్రత్యూష్ పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్ళూరుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. కాలేజ్ సిబ్బందికి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని అందజేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ, బైక్ ఢీ.. వ్యక్తి మృతి



మృతి చెందిన ప్రదీప్

ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, పెన్నేపల్లివద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం తిరుపతి వైపు నుండి నాయుడుపేట వైపు వెళ్తూ హైవేపై రోడ్డు పక్కన ఆగి ఉన్న ఐషర్ మినీ లారీని వెనుక వైపు నుంచి వస్తున్న బైక్ అతివేగంతో ఢీకొనుటతో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్ళగా తమిళనాడు, క్రిష్ణగిరి జిల్లా హోసూరుకు చెందిన ప్రదీప్ (27), బెంగళూరు నుండి విజయవాడకు స్నేహితుడి వివాహానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో ఎస్సై నాగరాజ్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, అతని తల్లిదండ్రులకు సమాచారం అందించి, మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

చిన్నపాటి గొడవ.. నలుగురికి తీవ్ర గాయాలు



ప్రజాశక్తి - నాయుడుపేట : ఒకే కాలనీలో నివాసం ఉంటున్న ఇద్దరు వ్యక్తులు గురువారం అర్ధరాత్రి వరకు పూటుగా మద్యం సేవించి వాదులాడుకున్న ఘటనలోకి ఇరు వర్గాల కుటుంబ సభ్యులు రావడంతో పెద్ద గొడవగా మారింది. నాయుడుపేట, సంజీవ్ గాంధీ కాలనీకి చెందిన రవి, నారాయణ అనే ఇద్దరు వ్యక్తుల మధ్య ఏర్పడిన వివాదంలో వారి కుటుంబ పెద్దలు, ఆడవారు కలుగజేసుకోవడంతో కొట్లాటగా మారింది. ఈ గొడవలో నలుగురికి తీవ్ర గాయాలు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని నాయుడుపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నాయుడుపేట పట్టణ సిఐ బాబి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు రోడ్డు ప్రమాదంలో మృతి



బి.వి.చలపతి (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగపు విశ్రాంత ఆచార్యులు బి.వి.చలపతి (67) రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలై ఆసుపత్రిలో మృతి చెందారు. రెండు రోజుల క్రితం ఎస్ వి యు ప్రధాన ద్వారం ఎదుట ఉన్న రోడ్డు క్రాస్ అవుతుండగా ఫ్లై ఓవర్ నుంచి వచ్చే వాహనం అదుపుతప్పి ఆయన మోటార్ సైకిల్‌ని ఢీకొట్టింది. ప్రమాదానికి గురైన ఆయనను వెంటనే సిమ్స్ ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయాలు కావడంతో బ్లడ్ క్లాటయ్య ఆయన మృతి చెందారు. మదనపల్లి ప్రాంతానికి చెందిన ఆయన ఎస్వీయూ పరిధిలోని చదువుకొని, అధ్యాపకులుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు ఒక కుమార్తె ఉంది. ఆమె అమెరికాలో ఉండటంతో అంత్యక్రియలు శనివారం నిర్వహిస్తున్నట్లు పరిశోధక విద్యార్థులు వెల్లడించారు. ఆచార్య బి.వి చలపతి మృతి పట్ల వర్సిటీ ఇన్చార్జి విసి ఆచార్య అప్పారావు రిజిస్ట్రర్ ఆచార్య భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ ఆచార్య కే.సుధారాణి, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య బి.వి.మురళీధర్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, ఇతర విశ్రాంత అధ్యాపకులు సంతాపం వ్యక్తం చేశారు.

రైస్ మిల్లులో చోరీ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ పరిధి, నెత్తం గ్రామ సమీపంలో ఉన్న రైస్ మిల్లులో శుక్రవారం సాయంత్రం దొంగతనం జరిగింది. రైస్ మిల్ తాళాలు పగలగొట్టి, ఏసీ, ఇన్‌వర్టర్, సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను దొంగలు దోచుకెళ్ళారు. స్థానికులు గుర్తించి కేకలు వేయగా దుండగులు పరారయ్యారు. రైస్ మిల్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఓబులేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి -కోట : కోట మండల కేంద్రంతో పాటు గ్రామాలలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం నుండి యువకులు తమ తోటి మిత్రులతో కలసి చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలో మార్వాడీలు, జైనలు కలిసి శుక్రవారం టిటిడి కళ్యాణ మండపం వద్ద హోలీ వేడుకలు నిర్వహించారు. రంగు నీళ్ళ చల్లుకుంటూ సందడి చేశారు.